శ్రీరస్తు శుభమస్తు అవిఘ్నమస్తు

భవాన్యాష్టకమ్

సంస్కృత మూలం :

శ్రీ మచ్ఛంకరాచార్యులు



తెలుగు పద్య తాత్పర్యములు

రచన :

అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు
M.Tech.

భవాన్యాష్టకమ్

మొదటి ప్రచురణ
మార్చి 2011

రచన
అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు
M.Tech.
Cell: 9393021360

వెల : అమూల్యం

ప్రతులకు :
ఫ్లాట్ నెం. 5, ప్లాట్ నెం.61, సిద్ధార్థ నగర్,
హైదరాబాద్ - 38. ఫోన్ : 093930 21360

డి.టి.పి. & ప్రింటింగ్ :
కె. మురళీ కృష్ణ
9848 51 51 09

ముందుమాట

భవానీ అష్టకము అహంకారముతో ఉన్నవాళ్లకు కనువిప్పు కలిగిస్తుంది. కొందరికి విద్య గర్వము, బుద్ధి గర్వము, ధనగర్వము, పదవి గర్వము, బలగర్వము ఉంటాయి. వీటినిచూసి మిడిసిపడుతుంటారు. కొందరు నా భార్య, నా పుత్రులు, నా బంధువులు, నా మిత్రవర్గం అని గర్వపడుతుంటారు. కొందరు నాకే సకల శాస్త్రాలు, యాగాలు, జప తపాదులు, వేదాలు, ఉపనిషత్తులు తెలుసని విర్రవీగుతుంటారు. ఏమీ తెలియని వారూ ఉంటారు. ఇందరికీ భవానీ అష్టకము చదివితే వారికి సమంగా ఫలితము ఉంటుంది. ఆమె తల్లి కాబట్టి మూఢులను, పరమోత్తమ భక్తులకు ఒకే విధంగా చూస్తుంది. అందుకే ఆమె అమ్మ భవాని. చెడ్డ కొడుకులు, చెడ్డ భక్తులు, చెడ్డ భర్తలు, చెడ్డవాళ్లు చాలా రకంగా ఉంటారు ప్రపంచంలో. కానీ చెడ్డతల్లి మాత్రం ఏ లోకాల్లో వెతికినను కనిపించదు.

పై అభిప్రాయం వ్యక్తం చేసిన శ్రీ డి.ఎన్. దీక్షితులు గారికి నా కృతజ్ఞతా సుమాంజలి.

ఆదిశంకరులంటే నాకున్న భక్తి ప్రపత్తులు గమనించి, ఆయన రచనలను పద్మములవలె తర్జుమాచేసి తాత్పర్య వివరణ ఇచ్చి ఆధ్యాత్మిక చింతన వున్న నా మిత్రులకి ఇవ్వటంలో నాకు అపరిమితమైన తృప్తి కలుగుతుంటుంది అని గ్రహించిన డా. జయంతి రంజన్‌గారు నాకు "గుర్‌గామ్" నుంచి సంస్కృతమూలం పంపించారు. భవానీమాత ఆదేశంగా భావించి ఈ భవాన్యాష్టకమును అనువదించాను. దీన్ని పూర్తిగా చదివితే మీకు కలిగే సత్ఫలితంపై నాకు ఆవగింజంత అనుమానం కూడా లేదు.

అమ్మలగన్నయమ్మ ముగురమ్మల మూలపుటమ్మగా పోతనగారిచే కీర్తింపబడిన ఈ తల్లి కంటికి రెప్పలా మనల్ని కాపాడుతుంటుంది. ఈ భవాన్యాష్టకమ్ నిత్యమూ పారాయణ చేసే వారిపై ఆ తల్లి కరుణ వుంటుందని వేరే వుంటుందని వేరే ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. **www.geetadeeksha.com** అనే వెబ్‌సైట్‌లో నా ఇతర రచనలు చదవండి.

ప్రార్థన

కం॥ శ్రీలక్ష్మి వాణి గౌరియు
క్ష్మాలగ మహిషాసురుండు కూడిరి యొకటై
పాలించి ముజ్జగంబుల
మాలావుగ కాచెనామె మాత భవానై

ఆ.వె॥ ఎందు జేసినట్టి యేనాటి పుణ్యమో
ఆదిశంకరులను ఆంధ్రమందు
అనువదించుటన్న అపరిమితంబైన
ప్రీతి కలుగు నాకు మిత్రులార!

ఉ॥ అమ్మలగన్న అమ్మయట అమ్మల ముప్వరి ఆదిమూలమై
ఇమ్మహి దుష్టశిక్షణకు యేపుగ జేరిన శక్తి తానహో!!
నమ్మిన వారి బ్రోచునట నాశము లేదుర విశ్వమాతకున్
మమ్ములగాచు అమ్మయని మాత భవానికి మ్రొక్కుడీయెడన్

చం॥ శిరసున చంద్రలేఖయట, చేతులు నాల్గట, కుంకుమాంకయై
బరువగు చన్గవల్ మెరసె మంగళమూర్తికి, కానవచ్చెనా
కరముల పాశమున్, చెఱకు ఖండము, అంకుశ, పుష్పబాణముల్
శిరమును వంచి మ్రొక్కెదను సేమముగా జగదేకమాతకున్

సీ॥ కారడవులయందు తరువుగా పెరుగును
కదలికయే లేక గడుపు బ్రతుకు
జంతు జన్మలయందు సతమతంబగుచుండు
'తిండి' కై బ్రతుకును తెలివిలేక
అజ్ఞాని మనుజుడై ఆశతో జీవించు
అదె జీవితంబని అలమటించు
కరుణతో 'పర దేవి' కను వాని నొకనాడు
జ్ఞానంబు నొందను 'తన' నెరుంగు

ఆ.వె॥ అవని నెవని జూడు అందరి కథ ఇదే
పేరు వేరుగాని జరుగునిదియె
మనకు శరణు దిక్కు మాత భవానియే
నాదు మాట నమ్మి నయము గనడు

అంకితము

మ॥ గత జన్మంబుల భాగ్యమేమొ జననీ! గావింతు నీ సేవలన్
ధృతిచే నీమముజేత, గాన యిక ఈ దీనున్ కటాక్షింపవే
కృతినీ కంకితమిత్తు దీనిగొనుమా గీర్వాణి నాంఘ్రీకరిం
చితినా శంకర సద్గురుల్ కరుణ నాశీర్వాదముల్ చేయగా.

భవాన్యాష్టకమ్

1

శ్లో॥ న తాతో న మాతా న బంధుర్నదాతా
న పుత్రో న పుత్రీ న భృత్యో న భర్తా,
న జాయా న విద్యా న వృత్తిర్మమైవ
గతిస్త్వం గతిస్త్వం త్వమేకా భవాని!

ఆ.వె॥ తల్లిదండ్రు లెరుగ తగు బంధుల నెరుంగ
పుత్రి, భృత్యులెరుగ పుత్రు నెరుగ
వృత్తినెరుగ, లేవు విద్యయు జ్ఞానంబు
మాకు గతి భవాని మాత శరణు

తా॥ ఓ మాతా! భవానీ! నేను తల్లిదండ్రుల నెరుగను. తగిన బంధువుల నెరుగను. కుమార్తె, భృత్యులు, కుమారులను కూడా నేనెరుగను. వృత్తికి సంబంధించిన నైపుణ్యం లేదు, విద్యలేదు, జ్ఞానంలేదు. నీ శరణు ఒక్కటే మాకు గతి.

2

శ్లో॥ భవాబ్ధావపారే మహాదుఃఖభీరుః
పపాత ప్రకామీ ప్రలోభీ ప్రమత్తః
కుసంసారపాశప్రబద్ధః సదాఽహం
గతిస్త్వం గతిస్త్వం త్వమేకా భవాని!

ఆ.వె॥ నే ప్రకామి, లోభి, నేను ప్రమత్తుండ
భవ్యజలధి దాట వగచు పిరికి
నేను కట్టువడితి నీచ సంసారాన
మాకు గతి భవాని మాతశరణు

తా॥ ఓ మాతా! భవానీ! నేను అమితమైన కామము గలవాడను, పరమలోభిని, అత్యధిక మదమచ్చరములను గలవాడను. అంతులేని భవసాగరమున ఉక్కిరి బిక్కిరగుచున్నాను. నేను విడలేని సంసారపాశముచే బంధించబడితిని. తల్లీ! అటువంటి నాకు నీ శరణ్యమొక్కటియే గతి.

3

శ్లో॥ న జానామి దానం న చ ధ్యానయోగం
న జానామి తంత్రం న చ స్తోత్రమంత్రమ్,
న జానామి పూజాం న చ న్యాసయోగం
గతిస్త్వం గతిస్త్వం త్వమేకా భవాని!

ఆ.వె॥ దానమెఱుగ, యోగ ధ్యానంబుల నెరుంగ
తంత్ర శాస్త్రమెఱుగ, మంత్ర మెఱుగ
ఎఱుగ నెట్టి పూజ, ఎరుగను న్యాసంబు
మాకు గతి భవాని మాత శరణు.

తా॥ ఓ మాతా! భవానీ! నేను దానము అంటే తెలియని వాడను. యోగమార్గంలో ధ్యానించుట నాకు తెలియదు. తంత్రశాస్త్ర పరిజ్ఞానం లేదు. పోనీ ఏదన్నా మంత్రం ఉపాసించానా అంటే అదీలేదు. నాకు ఏ పూజావిధానమూ తెలియదు. న్యాసము అంటే తెలియదు. (న్యాసము=ఉపనిధి, దాచియుంచిన పుణ్యము). ఇక నీ శరణ్యము తప్ప నాకు మరియొక దిక్కు లేదు తల్లీ!

4

శ్లో॥ న జానామి పుణ్యం న జానామి తీర్థం
న జానామి ముక్తిం లయం వా కదాచిత్,
న జానామి భక్తిం వ్రతం వాఽపి మాతః
గతిస్త్వం గతిస్త్వం త్వమేకా భవాని!

ఆ.వె॥ తీర్థయాత్రలెరుగ, తెలియను పుణ్యంబు
నేయెరుంగ ముక్తి లయము నెఱుగ
భక్తినెఱుగనైతి వ్రతమెఱుంగను తల్లి!
మాకు గతి భవాని మాతశరణు.

తా॥ ఓ మాతా! భవానీ! నేను ఎన్నడూ తీర్థయాత్రలు చేసి యెరుగను. పుణ్యకర్మలు పుణ్యమువంటివి అసలే తెలియదు. ముక్తి మోక్షం అనే పదములే వినలేదు. లయము చెందుట అంటే నాకు తెలియదు. భక్తివుందా అంటే అదీలేదు. వ్రతములంటే అర్థమే తెలియదు. తల్లీ! ఇకనాకు నీ శరణాగతి తప్ప మరొక దారిలేదు.

5

శ్లో॥ కుకర్మీ కుసంగీ కుబుద్ధిః కుదాసః
కులాచారహీనః కదాచారలీనః,
కుదృష్టిః కువాక్యప్రబంధః సదాహం
గతిస్త్వం గతిస్త్వం త్వమేకా భవాని!

తే॥ నీచ కర్మిష్ఠిని, కుసంగి, నే కుబుద్ధి
వ్యర్థ దాసుండ, స్వకుల ధర్మవిముఖుండ,
అప్పుడప్పుడు "ఆచార" మనెడి వాడ,
చెడ్డ దృష్టితో జూచుచు, చెడును పలుకు
నట్టివాడను సతతంబు, ఇట్టి చెడిన
మాకు గతి భవానీ మాత యొకతె శరణు.

తా॥ ఓ మాతా! భవానీ! నేను చెడుకర్మల కలవాటు పడ్డాను. నా సన్నిహితులు కూడా చెడినవారే. పోనీ బుద్ధిని చూద్దామా అంటే నా బుద్ధికూడా చెడ్డదే. దాసుడుగా కూడా నేను వ్యర్థుడనే. నా కులధర్మాన్ని ఏనాడో మంటగలిపాను. ఆచారం అప్పుడప్పుడు పాటిస్తాను. కష్టమైతే మానేస్తాను. నా దృష్టి చెడు దృష్టి. నేను నిరంతరం చెడుమాట్లాడటంలో ప్రబుద్ధుణ్ణి. ఇక నీ శరణాగతి తప్ప నాకు మరొక దారిలేదు తల్లీ!

6

శ్లో॥ ప్రజేశం రమేశం మహేశం సురేశం
దినేశం నిశీథేశ్వరం వా కదాచిత్,
న జనామి చాన్యత్ సదాఽహం శరణ్యే
గతిస్త్వం గతిస్త్వం త్వమేకా భవాని!

ఆ.వె బ్రహ్మ, విష్ణు, శివుడు, పాకారియే కాక
సూర్య, చంద్రులైన, సురవరులును
పొంద నీదు కరుణ మ్రొక్కేరు యొకనాడు
మాకు గతి భవాని మాత శరణు.

తా॥ ఓ మాతా! భవానీ! త్రిమూర్తులుగా ప్రసిద్ధులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు, దేవేంద్రుడు, సూర్యచంద్రులు మొదలైన దేవతలందరు నీ అనుగ్రహం సంపాదించుటకు తప్పక నీకు ఒకనాడు మ్రొక్కెదరు. అందుచేత మాకు నీ శరణ్యమొక్కటియే గతి.

7

శ్లో॥ వివాదే విషాదే ప్రమాదే ప్రవాసే
జలే చానలే పర్వతే శత్రు మధ్యే,
అరణ్యే శరణ్యే సదా మాం ప్రపాహి
గతిస్త్వం గతిస్త్వం త్వమేకా భవాని!

తే॥ పలు వివాదాల, వెతల, ఆపదలనైన,
పరుల నెలవున, జలమున, మంటనైన
పర్వతంబుల, శత్రుల మధ్యనైన,
దిక్కు తెలియని అడవుల సొక్కియైన,
సర్వదా మమ్ము రక్షించు సాయమగును
మాకు గతి భవానీ మాత యొకతె శరణు.

తా॥ అనేక తగువులాటలలో గాని, విషాదములలో గాని, పరుల పంచలోనున్న వేళలలోగాని, నీటిలో చిక్కుబడినప్పుడు గాని, మంటలలో అలమటించుచున్నప్పుడు గాని, పర్వతములందు తిరుగాడవలసి వచ్చినప్పుడు గాని, శత్రువుల స్థావరములో పట్టుబడినప్పుడు గాని, ఎటుపోతున్నామో తెలియని అడవులలో దారి తెన్ను తెలియనప్పుడు గాని, సర్వకాల సర్వావస్థలలో మాకు శరణం ఆ భవాని మాత యొక్కతె మాత్రమే.

8

శ్లో॥ అనాథో, దరిద్రో జరారోగయుక్తో
మహాక్షీణదీనః సదా జాడ్యవక్త్రః
విపత్తౌ ప్రవిష్టః ప్రనష్టః సదాఽహం
గతిస్త్వం గతిస్త్వం త్వమేకా భవాని!

తే॥ ధర ననాథులు దారిద్ర్య దళితులైన,
రుజ జరాగ్రస్థ పీడిత ప్రజలనైన
క్షయకు గురియౌట దీనులౌ జనులనైన,
మానసిక బాధ నవిసిన మనుజులైన,
ఆపదల నష్టముల వెతలందు బడిన
మాకు గతి భవానీ మాత యొకతె శరణు.

తా॥ ఓ మాతా! భవానీ! నీ భక్తులు అనాథలైపోయినప్పుడుగాని, వ్యాధుల చేత, వృద్ధాప్యము చేత సతమతమవుచున్నప్పుడు గాని, క్షయ వ్యాధికి గురియై దీనులైనప్పుడుగాని, మానసిక వ్యాధులచే కష్టములనుభవించు సమయములలో గాని, ఆపదలు, నష్టములు, దుఃఖములు బాధించునప్పుడుగాని మాకు నీవొక్కదానివే గతి. నీవే శరణము.

ఇది శ్రీ ఆదిశంకరాచార్యుల వారిచే
రచింపబడిన 'భవాన్యాష్టకమ్'
అను
సంస్కృత అష్టకమునకు
తెలుగు పద్య తాత్పర్య అనువాదము